ఎండుతున్న ఎడగారు వరి

- ఎడమ కాలువకు అందని సాగునీరు
- లిఫ్ట్ ద్వారా విడుదల చేయాలంటున్న రైతులు
- నిమ్మ, జామ, సవక పంటలకు కూడా ఇబ్బంది
- కాలువ వెంబడి నాట్లు వేసిన రైతులు



మొగళ్లూరులో ఎండుతున్న వరి

పొదలకూరు: ఎడగారులో రెండో పంటగా వరి సాగు చేస్తున్న రైతులకు సాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కండలేరు ఎడమగట్టు కాలువ ద్వారా నీరందుతుందని భావించిన రైతులు కొందరు ఖరీఫ్‌లో వరిసాగు చేపట్టారు. 20 రోజుల క్రితం నాట్లు పూర్తి చేశారు. అయితే కాలువకు సాగునీరు అందకపోవడంతో నాట్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదలకూరు మండలంతోపాటు, చేజర్ల మండలంలోని నాలుగు గ్రామాలకు కండలేరు హైలెవల్ స్లూయిజ్ గ్రావిటీ ద్వారా ఇటీవల సాగు నీటిని అందించాలని చూశారు. అయితే గ్రావిటీ ద్వారా సాగునీరందడం లేదు. కండలేరు జలాశయంలో 35 టీఎంసీలకు పైబడి నీరు నిల్వ ఉండాలి. అయితే ప్రస్తుతం 30 టీసీఎంలు మాత్రమే నీటి నిల్వ ఉంది. దీంతో హైలెవల్ స్లూయిజ్‌కు నీరు అందడం లేదు.

గ్రామాల్లో స్వల్పంగా వరిసాగు

కాలువ వెంబడి ఉన్న గ్రామాల్లో కొందరు రైతులు వరిసాగు చేస్తుండగా వేలాది ఎకరాల్లో నిమ్మ, జామ, సవక, జామాయిల్ వంటి మెట్ట పంటల సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఎడగారులో రైతులు వేసిన వరినాట్లు ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయి. మండలంలోని మొగళ్లూరు గ్రామానికి చెందిన రైతులు సుమారు 35 ఎకరాల్లో కాలువ వెంబడి వరినాట్లు వేశారు. సాగుకు నీరు అందకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.వేలు ఖర్చు పెట్టి నాట్లు వేశామని కాలువకు నీరు రాకుంటే పంటలు నిలువునా ఎండిపోతాయంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవతీసుకుని నీటిని విడుదల చేయంచాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

లిఫ్ట్ ద్వారా నీటి విడుదలకు అవకాశం

హైలెవల్ స్లూయిజ్‌కు కండలేరు జలాశయం నుంచి నీరు అందకుంటే లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కాలువకు నీటిని పంపింగ్ చేసే వెసులుబాటు ఉంది. ఈ నేపథ్యంలో లోలెవల్ స్లూయిజ్ ద్వారా ఎడమగట్టు కాలువకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేయించాలని రైతులు వేడుకుంటుకున్నారు. స్వల్పంగానైనా నీటిని విడుదల చేస్తే ఎడగారు వరిని కాపాడుకుంటామని వెల్లడించారు.



నీరు లేని ఎడమగట్టు కాలువ

బతుకులు మారలేదని గిరిజనుల ఆవేదన



మాట్లాడుతున్న గిరిజనులు

ముత్తుకూరు(పొదలకూరు): పైనాపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎన్ని పరిశ్రమలున్నా తమ బతుకులు మారడం లేదంటూ ఆ గ్రామ గిరిజన కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో మంగళవారం మీడియా సమావేశంలో గిరిజనులతో కలిసి మల్లికార్జున మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మూడు జెన్కో ప్రాజెక్ట్‌లు వచ్చినా గిరిజనులకు ఉపాధి అవకాశాలు లేవన్నారు. తమను పనులకు ఎవరూ పిలవడం లేదని, సీఎస్ఆర్ ఫండ్స్‌ను పరిశ్రమల యజమానులు బయటి ప్రాంతాల్లో ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాంతంలో కేవలం రూ.3 కోట్లు వెచ్చిస్తే కాలనీలు బాగుపడతాయని వెల్లడించారు. పరిశ్రమలున్నా అట్టడుగు వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీలకు పనులు కల్పించలేకపోతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు అవగాహన

ముత్తుకూరు(పొదలకూరు): పట్టణంలోని ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, జెడ్పీ హైస్కూల్లో శిక్షణ, ఉపాధి ప్రోత్సాహక సంస్థ (సెట్నెల్) ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. సైకాలజీ, మాస్టర్ ట్రెయినర్ డాక్టర్ బి.సురేష్‌బాబు అభ్యసనాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలు, పరీక్షల్లో సబ్జెక్ట్ మరిచిపోవడం వంటి అంశాలపై మాట్లాడారు. సీఈఓ నాగేశ్వరరావు విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. సదస్సులో ఎంఈఓ హేమసుందరరావు, సెట్నెల్ సూపరింటెండెంట్ గయాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్‌బాబు

సీసీఆర్ కార్డులను చేయించుకోండి

కొడవలూరు: సీసీఆర్ కార్డులను కౌలు రైతులు విధిగా చేయించుకోవాలని ఏఓ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని ఆలూరుపాడు, రామన్నపాళెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంటను రైతులు విధిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై ఇస్తున్నామని, రైతు సేవా కేంద్రాలను సంప్రదించి వీటిని పొందాలని కోరారు. వీఏఏలు శివజ్ఞాన, జాహ్నవి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

బీఈడీ సెమిస్టర్ పరీక్షల్లో సత్తా

నెల్లూరు (టౌన్): బీఈడీ సెమిస్టర్ ఫలితాల్లో ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థులు సత్తా చూపారని ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను సంతపేటలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో మంగళవారం అభినందించిన అనంతరం ఆమె మాట్లాడారు. వర్సిటీ స్థాయిలో మహిమ 8.6, తమ్‌సీన్ 8.5 జీపీఏను సాధించారని పేర్కొన్నారు. 95 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు.



ప్రసన్నను కలిసిన మైపాడు వాసులు



కోవూరు: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో మైపాడుకు చెందిన పలువురు మంగళవారం కలిశారు. శ్రీకాంత్, ఈదూరు పెంచలయ్య, పెనుమాక సతీష్, హరికుమార్ తదితరులు పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: గేదెలు అడ్డురావడంతో మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని ఇస్కపాళెం సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గూడూరు పట్టణానికి చెందిన ఆంజనేయులు పని నిమిత్తం బైక్‌పై నిడిగుంటపాళెం వెళ్తున్నాడు. ఇస్కపాళెం సమీపంలో గేదెలు ఒక్కసారిగా అడ్డురావడంతో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదు

- కలెక్టర్ ఆనంద్

కోవూరు: అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రధానంగా భూ, రెవెన్యూకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా వస్తున్నాయని, వీటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కో ఆప్షన్ సభ్యుడిగా వినోద్‌కుమార్



వినోద్‌ను సత్కరిస్తున్న అధికారులు

విడవలూరు: ఊటుకూరుకు చెందిన వినోద్ ఏపీ పోలీస్ అధికారుల సంఘ రాష్ట్ర కో ఆప్షన్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఏపీ పోలీస్ అధికారులు సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ యూనిట్ల ప్రతినిధుల సమావేశాన్ని ఒంగోలులో నిర్వహించారు. ఇస్కపల్లి మెరైన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వినోద్‌కుమార్‌ను రాష్ట్ర కో ఆప్షన్ సభ్యుడిగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జనకల శ్రీనివాసులు నియమించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా హజరతయ్య, సభ్యులు శ్రీహరి, శేషయ్య, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సర్వీసులకు ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు జిల్లా స్టోర్స్‌లో సిద్ధంగా ఉన్నాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్ నుంచి జిల్లా అధికారులతో మంగళవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. నూతన వ్యవసాయ సర్వీసులకు వచ్చిన దరఖాస్తులకు అంచనాలను రూపొందించాలని, పూర్తయిన వాటిని వెంటనే అందజేయనున్నామని వెల్లడించారు. ఇప్పటికే మంజూరైన కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లను సంబంధిత అధికారులు తీసుకోలేదని తెలిపారు. ఈఈ శేషాద్రిబాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

నెల్లూరు(టౌన్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్ ముందుంటోందని జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 12వ పీఆర్సీ కమిటీని నేటికీ నియమించలేదని ఆరోపించారు. మున్సిపల్ పాఠశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసి గుణాత్మక విద్యనందించేలా చూడాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మురళీకృష్ణ, పట్టణ శాఖ బాధ్యులు శ్రీనివాసులు, వెంగబాబు, మహేష్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల మృత్యువాత

- పట్టించుకోని వైద్యులు

వెంకటాచలం: మండలంలోని పలు గ్రామాల్లో మూగజీవాలు ఏ వ్యాధితో మృతిచెందుతున్నాయో తెలియక పాడి రైతులు ఆందోళన చెందుతున్నాయి. పశువైద్యులు, సిబ్బంది గ్రామాల్లో కనిపించడం లేదు. రామదాసుకండ్రిగ, జంగాలపల్లి, కందలపాడు, కురిచెర్లపాడు, తిక్కవరప్పాడు, కంటేపల్లి తదితర గ్రామాల్లో కొన్నిరోజుల నుంచి గొర్రెలు, మేకలు అకస్మాత్తుగా చనిపోతున్నాయి. మేత కోసం అడవికి తోలిన గొర్రెల్లో నిత్యం ఎవరో ఒకరివి అంతుచిక్కని వ్యాధితో మృతిచెందుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది తిరిగి మూగజీవాలకు టీకాలు వేయకపోవడమేననే ఆరోపణలున్నాయి. ఇడిమేపల్లి, జంగాలపల్లి గ్రామాల్లో ఎక్కువగా గొర్రెలు, మేకలు మృతి చెందుతున్నాయని చెబుతున్నారు.



రామదాసుకండ్రిగలో మృతి చెందిన గొర్రె

యూరియా వినియోగంలో నియంత్రణ అవసరం

మనుబోలు: వరిసాగుకు సంబంధించి యూరియా వినియోగంలో రైతులు నియంత్రణ పాటించాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య అన్నారు. మండలంలోని వడ్లపూడి, రాజోలుపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా ఎక్కువగా వాడితే వరిలో పురుగులు, తెగుళ్లు ఎక్కువయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాగే జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చరొట్ట పంటలు సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు. రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని భూమి స్వభావానికి అనుకూలమైన పంటలను సాగు చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలని వాటి స్థానంలో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎరువులు, నీటి యాజమాన్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు శివకుమార్, విజిత పాల్గొన్నారు.



మనుబోలు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

➪ పొదలకూరు: ఎడగారులో సాగు చేస్తున్న వరికు నీటి యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటించాలని పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఇనుకుర్తి, బిరదవోలు గ్రామాల్లో క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఇష్టానుసారం యూరియాను వినియోగించవద్దని పేర్కొన్నారు. ఇప్పటికే రైతులు చాలామంది యూరియాను మూడు కోటాల మేరకు చల్లినట్టు తెలిపారు. వరిపంటను ఆశించే వివిధ రకాల తెగుళ్ల గురించి ఏఓ ప్రతాప్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు హేమలత, మౌనిక పాల్గొన్నారు.



పొదలకూరులో..

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

పొదలకూరు: పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సాయిబాబా ఏజెన్సీలో రికార్డులను పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని సక్రమంగా ఉన్నాయని యూరియాను అక్రమంగా నిల్వ వేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. తనిఖీల్లో ఒంగోలు విజిలెన్స్ సీఐ రాఘవరావు, వినుకొండ ఏడీఏ రవి కుమార్, పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్, ఏఓ ప్రతాప్ పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాస్వామ్యంలో రాక్షస పాలన



మాట్లాడుతున్న మైనార్టీ నేతలు

కోవూరు: ప్రజాస్వామ్యంలో రాక్షస పాలనను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాగిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నేతలు ఆరోపించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం వారు మాట్లాడారు. మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై టీడీపీ మూకలు సాగించిన దాడి ప్రజాస్వామ్యానికే మచ్చ అన్నారు. ప్రసన్నను హతమార్చేందుకే టీడీపీ గూండాలు ఆయన ఇంట్లోకి చొరబడ్డారని మండిపడ్డారు. ఎవరి పేరు లేకుండా పోలీసులు కేసు పెట్టడం దుర్మార్గమని చెప్పారు. తమ పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా ప్రశాంతి రెడ్డి గెలిచాక బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఏ అభివృద్ధి జరిగిందో అందరికీ తెలుసునని చెప్పారు. మాజీ మంత్రికే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పార్టీ మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, మైనార్టీ నేతలు గయాజ్, షాహుల్, కరిముల్లా, దౌలత్, నయీం, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను వైద్య, ఆరోగ్యశాఖాధికారులు ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. నగరంలోని వెంకటరమణ ఆస్పత్రి, విజయ డయాగ్నొస్టిక్స్, సింహపురి, శ్రీనివాస స్కాన్ సెంటర్లలో రికార్డులను జిల్లా లెప్రసీ, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ, వెంకటాచలం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వేదవల్లి వాణిశ్రీ, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నరసింహారావు పరిశీలించారు. పీసీ, పీఎన్డీటీ యాక్ట్ ప్రకారం వ్యవహరిస్తున్నారానే అంశాన్ని ఆరాతీశారు. లింగ నిర్ధారణ చేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. స్కానింగ్ చేసిన వారి వివరాలను ఫారమ్ - 4లో నమోదు చేసి వైద్యశాఖకు పంపాలని కోరారు. టీబీ నివారణ సిబ్బంది విజయకుమార్, హరీష్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.



పక్కాగా రక్త పరీక్షలు

నెల్లూరు(అర్బన్): సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గానూ రక్త పరీక్షలను ల్యాబ్ టెక్నీషియన్లు పక్కాగా నిర్వహించాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. నగరంలోని పీసీ నాయుడి వీధి, జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో గల పట్టణ ఆరోగ్య కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ల్యాబ్ రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. జ్వరాలు నమోదవుతున్న ప్రాంతాల్లో ఆరోగ్య కార్యకర్తలు తక్షణమే స్పందించి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్ టెక్నీషియన్లకు సకాలంలో చేర్చాలని కోరారు. నూతనంగా రూపొందించిన రిజిస్టర్లను నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది కరుణమ్మ, గురవయ్య, సంజీవకుమార్, ఆరోగ్య పర్యవేక్షకురాలు గిరిజావతి తదితరులు పాల్గొన్నారు.



రిజిస్టర్లను పరిశీలిస్తున్న హుస్సేనమ్మ

క్లుప్తంగా

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ

మనుబోలు: ఆషాఢ మాసం మూడో మంగళవారాన్ని పురస్కరించుకుని మనుబోలు కోదండరామపురంలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు అభిషేకం నిర్వహించారు. దేవి ఖడ్గమాలార్చన, కుంకుమ పూజలు నిర్వహించి వివిధ రకాలు కూరగాయలతో శాకంబరి అలంకారం చేశారు. ఉభయదాతలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ వ్యవహరించారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



కొడవలూరు: మండలంలోని రామన్నపాళెం సచివాలయంలో పనిచేస్తూ వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగులను మంగళవారం సత్కరించారు. సర్వేయర్ పోకూరి సంతోష్, డిజిటల్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, వీఏఏ నిహారిక, వెటర్నరీ అసిస్టెంట్ హరి, వెల్ఫేర్ అసిస్టెంట్ సునీల్‌కుమార్, మహిళా పోలీస్ ప్రభావతిని సన్మానించారు. మాజీ ఉప సర్పంచ్ కాకి సుమన్, పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్, కరేటి శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు అభినందన



నెల్లూరు రూరల్: రెవెన్యూ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కలెక్టరేట్ మహిళా ఉద్యోగులను డీఆర్వో హుస్సేన్ సాహెబ్ మంగళవారం అభినందించారు. కలెక్టరేట్లో డీఆర్ఓను మహిళా ఉద్యోగులు కలిశారు. ఏఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ మహాసంఘ నూతన కార్యవర్గ ఏర్పాటు



నెల్లూరు(బృందావనం): అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఓ కల్యాణ మండపంలో అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ, ఆంధ్రప్రదేశ్ విభాగ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మహాసంఘ జిల్లా గౌరవాధ్యక్షుడిగా శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడిగా రేవూరు వెంకటకళాధర్‌రావు, కార్యదర్శిగా మామిడిపల్లి చంద్రశేఖర్, కోశాధికారిగా భట్టారం రాఘవేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడిగా గావి మాధవాచార్యులు, అర్చక, పురోహిత విభాగ గౌరవ సలహాదారులుగా నాగరాజుతో కార్యవర్గం ఏర్పాటైంది. కేంద్ర కమిటీ అనుమతితో ఏర్పాటైన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేశారు.

శాస్త్రీయ సమాజానికి కృషి

నెల్లూరు(అర్బన్): మూఢ నమ్మకాల్లేని శాస్త్రీయ సమాజం.. సైన్స్ ఫలాలు సామాన్యులందరికీ దక్కాలనే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందని వేదిక రాష్ట్ర నూతన అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని బాలకోటేశ్వరరావు ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ అభినందన సమావేశంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్‌బాషా, డాక్టర్ బాలకోటేశ్వరరావు మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా ఉంటూ.. తన ఖాళీ సమయాన్ని వెచ్చిస్తూ జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్ ఉద్యమాల్లో శ్రీనివాసులు చురుకైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అనంతరం ఆయనతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా నుంచి ఎన్నికైన చక్రపాణి, రాష్ట్ర సలహా మండలి సభ్యుడు శేషారెడ్డి, కార్యదర్శి గీతాంజలిని సన్మానించారు.